10-06-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

తెలుగు దినపత్రిక

ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 253 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



# న్యాయవ్యవస్థపై నమ్మకం వుంది

**మాజీ మంత్రి హరీష్ రావు సోమవారం నాడు కాళేశ్వరం కమిషన్ ముందు హాజరయ్యారు. అంతకుముందు హరీష్ రావు మాట్లాడుతూ న్యాయవ్యవస్థ మీద, చట్టాల మీద, రాజ్యాంగం మీద మాకు అపారమైన నమ్మకం బి ఆర్ ఎస్ పార్టీకి ఉంది.అందుకే కమిషన్ ముందు హాజరు అవుతున్నాం. కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతామని అన్నారు. ప్రభుత్వం విద్వేషంతో ఆలోచన చేయకూడదు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నది. రాజకీయాల కోసం తెలంగాణ నీటి హక్కులను కాల రాయద్దు. అంతిమంగా న్యాయం గెలుస్తది.న్యాయం మీద నమ్మకం ఉంది, దైవం మీద నమ్మకం ఉంది. మేము ప్రభుత్వంలో లేము, అందుబాటులో ఉన్న సమాచారం అందిస్తామని అన్నారు.**

- కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా పిలవడం జరిగింది.
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**జయభేరి, హైదరాబాద్ :**

కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగింది. ఆధారాలతో సమాధానాలను కమిషన్ కు అందించడం జరిగింది. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రాజకీయాలు ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందాం. లోపట ఒకటి చెప్పి బయట ఒకటి చెప్పడం తప్పు అవుతుంది. మొట్టమొదలు తమ్మిడి హట్టి నుండి మేడిగడ్డకు బ్యారేజ్ ను ఎందుకు మార్చారు అనేదానిపై చాలాసేపు డిస్కషన్ జరిగింది. దానికి నేను కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తమ్మిడి హట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నం చేసాము. ఇరిగేషన్ మంత్రిగా రివ్యూ చేసినప్పుడు ప్రాణాహిత ప్రాజెక్టు 7 ప్యాకేజీలు 27 భాగాలుగా టెండర్లను పిలిచింది గత కాంగ్రెస్ ప్రభుత్వం. తల పనులు స్టార్ట్ చేయకుండా తోక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వింది.

...మిగతాది 2 లో

# ఇప్పటికైతే ఓకే..!



...మిగతాది 2 లో

ఒకవైపు సంతోషం, మరోవైపు అసంతృప్తి.. ఇంకోవైపు బుజ్జగింపులు.. వెరసి రోజంతా హైడ్రామా నడిచింది. ఎవరు ప్రెస్‌మీట్ పెట్టి ఏం బాంబులు పేలుస్తారో అనుకున్నా, మీనాక్షి, మహేష్ చర్చలు ఫలించి అంతా సైలెంట్ అయ్యారు. మరి మంత్రిపదవి ఆశించిన వారికి ఏం హామీలిచ్చారు? అసంతృప్తులు ఏం చెప్తున్నారు?. ఆ ముగ్గురికి ఎలాంటి శాఖలు దక్కబోతున్నాయ్.. అనేది ఆసక్తికరంగా మారింది.

- నిరాశలో సీనియర్లు
- సుదర్శన్ రెడ్డి ఇంటికెళ్లి బుజ్జగించిన మీనాక్షి
- ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి
- హైకమాండ్ నిర్ణయం ఎలా ఉండబోతుంది?

**జయభేరి, హైదరాబాద్ :**

ఎన్నో నెలల ఎదురుచూపుల తర్వాత.. తెలంగాణ కేబినెట్ విస్తరణ ముగిసింది. బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ ముగ్గురికి అవకాశం ఇచ్చారు. ఊహించని విధంగా.. మంత్రి పదవులు వరించిన వారు ఫుల్ ఖుషీలో ఉన్నారు. గడ్డం వివేక్ (చెన్నూరు), అడ్లూరి లక్ష్మణ్(ధర్మపురి), వాకిటి శ్రీహరి ముదిరాజ్ (మక్తల్) మంత్రి పదవులు దక్కించుకున్నారు. ఏడాదిన్నరపాటు నాన్చి.. నాన్చి.. చివరకు ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఎవ్వరినీ నొప్పించకుండా, ఇంకెవ్వరూ మాట్లాడకుండా.. సామాజిక సమీకరణలకు ప్రాధాన్యం ఇస్తూ.. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, శ్రీహరిని అమాత్యులుగా చేశారు. కేబినెట్ విస్తరణలో సోషల్ కార్డును వాడారు. బీసీ, ఎస్సీలకు పెద్ద పీట వేశారు. దీంతో మంత్రి పదవులు దక్కించుకున్న వారితో గవర్నర్ ప్రమాణం చేయించారు. అయితే.. మంత్రివర్గ విస్తరణ జరిగినా.. కాంగ్రెస్ పార్టీలో రోజంతా టెన్షన్ కొనసాగింది. మంత్రి పదవులు ఆశించిన సీనియర్లకు నిరాశ ఎదురవ్వడంతో బుజ్జగింపులకు దిగారు కాంగ్రెస్ ముఖ్య నేతలు. కొందరికి పార్టీ పదవుల ఆఫర్‌తో పాటు.. మరో మూడు బెర్త్‌లు ఖాళీ ఉండటంతో.. అందులో అవకాశం ఇస్తామని చెప్పినట్లు తెలుస్తోంది.

**సుదర్శన్ రెడ్డి ఇంటికెళ్లి బుజ్జగించిన మీనాక్షి**

కొత్త మంత్రుల పేర్లు అనౌన్స్ కాగానే.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రంగంలోకి దిగారు. రాజీనామా చేస్తానని కార్యకర్తల దగ్గర చర్చించిన.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇంటికెళ్లి బుజ్జగించారు మీనాక్షి నటరాజన్. మీ సేవలను పార్టీ గుర్తిస్తుందని మీనాక్షి నచ్చజెప్పడంతో అలక వీడారు. పార్టీకి విధేయుడిగా ఉంటానని.. హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అన్నారు సుదర్శన్‌రెడ్డి. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావును సైతం కన్విన్స్ చేశారు మీనాక్షి నటరాజన్. రాబోయే రోజుల్లో అవకాశం

# రైతులకు 4 శాతం వడ్డీకే రూ. 3 లక్షల రుణం



2 లో

**జయభేరి, న్యూఢిల్లీ జూన్ 9:**

దేశంలోని రైతులకు మోడీ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోంది. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రకరకాల స్కీమ్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. మోడీ సర్కార్ ముందుగా రైతులకు ప్రాముఖ్యతను ఇస్తుంది. ఈ నేపథ్యంలో దేశంలో లక్షలాది మంది రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామ్ అన్నారు. ఈ పథకం ద్వారా రైతులు సకాలంలో తక్కువ వడ్డీ రేటుకే రుణ సౌకర్యాన్ని పొందుతున్నారని అన్నారు. దీనికి సంబంధించి వివరాలను ఎక్స్ వేదిక పోస్టు చేశారు. రైతులకు అందించే ఈ రుణాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి వ్యవసాయ అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగపడుతున్నాయని అన్నారు.

# నాలుగేళ్ల ముందే అలెర్ట్

- బ్యాడ్ నేమ్ తెచ్చుకుంటున్న ఎమ్మెల్యేలపై గురి



2 లో

**జయభేరి, విజయవాడ, జూన్ 9:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు నాలుగేళ్లకు ముందే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది. ఎమ్మెల్యేల పనితీరును గమనించకపోతే అసలుకే ఎసరు వస్తుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కూటమి హవాలో 164 స్థానాల్లో సూపర్ డూపర్ విక్టరీ సాధించినప్పటికీ గత ఏడాదిగా కూటమి పార్టీల నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో, కిందిస్థాయిలో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పాటు విభేదాలు మరింతగా ముదిరి వీధిన పడుతుండటంతో మూడు పార్టీలకు తలనొప్పిగా తయారయింది. అన్ని చోట్ల ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఇక ఎమ్మెల్యేల



# కుళ్లిపోయిన చికెన్‌తో బిర్యానీ..!

## తార్నాక చౌరస్తాలో GHMC డిప్యూటీ మేయర్ ఆకస్మిక తనిఖీలు

**హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, తార్నాకలోని డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో కుళ్ళిన చికెన్‌తో బిర్యానీ అమ్ముతున్నట్లు తెలుసుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాత, అనారోగ్యకరమైన ఆహార పదార్థాలను గుర్తించారు. నగరంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఆహార భద్రతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.**

**జయభేరి, హైదరాబాద్ :**


హైదరాబాద్ నగరంలో నాణ్యత ప్రమాణాలు పాటించని హోటల్లు రెస్టారెంట్లు టిఫిన్ సెంటర్ లపై ఆకస్మిక తనిఖీలు చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆదేశించారు. తార్నాక చౌరస్తా వద్ద ఉన్న డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో

...మిగతాది 2 లో

# ఎయిర్ పోర్టు లో మీడియాపై ప్రభాకర్ రావు అనుచరుల దాడి

**జయభేరి, శంషాబాద్:**

మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావు బౌన్సర్లు శంషాబాద్ ఎయిర్పోర్టులో మీడియాపై దాడికి పాల్పడ్డారు. ప్రభాకర్ రావు ఎయిర్పోర్ట్ నుండి బయటికి వచ్చే సమయంలో 50 మంది తన అనుచరులు వచ్చారు. 15 మంది బౌన్సర్లను పెట్టుకొని మీడియా వారిపై దాడికి పాల్పడ్డారు. ఇమిగ్రేషన్ కార్యాలయంలోనే మూడు గంటలపాటు ప్రభాకర్ రావు వివరాలు అధికారులు తీసుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుండి బయటికి వచ్చే సమయంలో ప్రభాకర్ రావును మాట్లాడించే ప్రయత్నం మీడియా చేసింది. అదే సమయంలో ప్రభాకర్ రావు వెంట ఉన్న బౌన్సర్లు మీడియా ప్రతినిధులను నెట్టివేసి దాడికి పాల్పడ్డారు.



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇప్పటికైతే ఓకే..!

దక్కుతుందని చెప్పడంతో అసంతృప్తి వీడారు. MLA రాజగోపాల్ రెడ్డితోనూ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. మీనాక్షి నటరాజన్, మంత్రి వివేక్ రాజగోపాల్ రెడ్డిని బుజ్జగించారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల నుంచి మంత్రులు ఎవ్వరూ లేకపోవడంతో.. ఈసారి మంత్రివర్గంలో పక్కాగా చోటు దక్కుతుందనుకున్న మల్ రెడ్డి రంగారెడ్డి తీవ్ర నిరాశకు గురయ్యాడు. అనుచరులతో చర్చించి.. మీడియా ముందుకు వచ్చేందుకు రెడీ అవ్వగా.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించారు. మీనాక్షి నటరాజన్ మల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి నచ్చ జెప్పారు. పార్టీని కాపాడుకోవాలన్నదే తమ తాపత్రయం అన్నారు మల్ రెడ్డి. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం ఎక్కువ.. మంత్రివర్గంపై భారీ ఆశలు పెట్టుకున్న సీనియర్లు.. ప్రస్తుత బుజ్జగింపులకు ఓకే అన్నా.. మున్ముందు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.

**ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి..**

ముగ్గురికి మంత్రి పదవులు దక్కడం.. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి ఏ శాఖలు ఇవ్వబోతున్నారు?.. అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఎం దగ్గర శాఖలు కేటాయిస్తారా?. ఇతర మంత్రులకు తగ్గించి.. ఈ ముగ్గురికి కేటాయిస్తారా అన్నది సస్పెన్స్‌గా మారింది.. దీనికి మరికొన్ని గంటల్లో తెరపడే అవకాశం ఉంది. దీనిపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రుల శాఖలు, పార్టీ పదవుల పై చర్చించనున్నారు. మొత్తంగా హైకమాండ్ నిర్ణయం ఎలా ఉండబోతుంది? ఎవరికి ఏ శాఖలు దక్కబోతున్నాయి అనేది ఇంకొన్ని గంటలు ఎదురు చూడాల్సిందే..

## కుళ్లిపోయిన చికెన్‌తో బిర్యాని..!

కుళ్లిపోయిన చికెన్ ఉపయోగించి బిర్యానీ ప్రజలకు అందిస్తుండడంతో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి స్పందించి, రెస్టారెంట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా పాత, అన్ హైజినిక్ ఆహార పదార్థాలు గుర్తించి, రెస్టారెంట్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులతో మాట్లాడిన డిప్యూటీ మేయర్ గారు, డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో ఉన్న అన్ని నాన్‌హైజినిక్ పదార్థాలపై వెంటనే ఇన్స్పెక్షన్ చేయించి, కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. "ఆహార నాణ్యతకు దూరమైన అన్ని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా నగర ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడటానికి మేము కట్టుబడి ఉన్నాము. హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు తగిన నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు," అని హెచ్చరించారు. అలాగే నగరంలోని అన్ని రెస్టారెంట్లు, హోటల్స్, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్యలు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో కీలకమని తెలిపారు.

## 4 శాతం వడ్డీకే రూ. 3 లక్షల రుణం

కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం రైతులకు బలమైన ఆర్థిక సహాయంగా మారిందని, ఇప్పటివరకు 465 లక్షల దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. వీటి పరిమితి రూ.5.7 లక్షల కోట్లకు చేరుకుందని ఆమె అన్నారు. క్రెడిట్ కార్డుల ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయి. కెసిసి ద్వారా, వ్యవసాయ కార్యకలాపాలకు వారి ఆర్థిక అవసరాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణ రూపంలో రూ.5 లక్షల వరకు సహాయం చేస్తుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కార్యాలయం నుండి విడుదల చేసిన పోస్ట్‌లో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) ఇప్పుడు దేశంలోని లక్షలాది మంది రైతులకు ఆర్థిక జీవనాధారంగా మారిందని ఆర్థిక మంత్రి అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి ముఖ్యమైన వస్తువులను కొనుగోలు చేయడంలో, పంట ఉత్పత్తికి సంబంధించిన నగదు అవసరాలను తీర్చడంలో కెసిసి పథకం రైతులకు గొప్ప సౌలభ్యాన్ని అందించిందని ఆమె అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయని ఆమె అన్నారు. రైతు సకాలంలో చెల్లిస్తే, రూ.3 లక్షల వరకు రుణంపై 4 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి. దీనితో పాటు, రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించినందుకు 3 శాతం అదనపు సత్వర చెల్లింపు ప్రోత్సాహకం కూడా అందిస్తుంది. దీని కారణంగా రైతులు ప్రతి లక్ష రూపాయలపై ప్రతి సంవత్సరం దాదాపు రూ.9,000 వడ్డీని ఆదా చేయవచ్చు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఇప్పుడు ఈ సబ్సిడీ రుణ పరిమితిని రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచింది. దీని వలన రైతులకు మాత్రమే కాకుండా మత్స్యకారులు, పాడి రైతులకు కూడా ప్రయోజనం చేకూరింది. ఇప్పటివరకు 7.7 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందినట్లు కేంద్రం తెలిపింది. 2013లో వ్యవసాయ బడ్జెట్ కేవలం రూ.21,500 కోట్లు మాత్రమేనని, 2024 నాటికి దానిని రూ.1.22 లక్షల కోట్లకు పెంచామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

## నాలుగేళ్ల ముందే అలెర్ట్

పనితీరు కూడా అంత ఆశాజనకంగా లేదని అందుతున్న నివేదికలను బట్టి తెలుస్తోంది ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా 88 మంది వరకూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలతోనే సమస్య తలెత్తుతోంది. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల ఈ సమస్య పెద్దగా కనిపించడం లేదు. వారిపై పెద్దగా ఆరోపణలు కూడా రావడం లేదు. ఎందుకంటే వారి అనుభవంతో అనేక విషయాలను బయటకు రాకుండానే సహజంగా జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు మాత్రం నేరుగా రంగంలోకి దిగి బ్యాడ్ నేమ్ ను కొని తెచ్చుకుంటున్నారు. ఇసుక తరలింపు, మద్యం షాపుల వేలంపాటలు, బార్లను కొనసాగించడం, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూర్చడం వంటి విషయాల్లో కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేల పేర్లు జనం నోళ్లతో నానుతున్నాయి.. ఒకవైపు సంక్షేమ పథకాలు అందలేదని జనంలో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో మరొకవైపు అవినీతిని ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటం కూడా ప్రజల్లో పలచనకు కారణమయింది. తాము పరిపాలనలో ఎన్ని సంస్కరణలు, ఎన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు సక్రమంగా లేకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల ముందే అప్రమత్తమయ్యారు. అందుకే ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు తన వంతుగా ఆయన ప్రయత్నాలను ప్రారంభిస్తున్నట్లు కనపడుతుంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు , కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి.. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని నేరుగా చెప్పేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు తెప్పించుకునేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అంతేకాదు తాను మంచి చేస్తే అభినందిస్తానని, తప్పు చేస్తే దూరం పెడతానని కూడా చెప్పారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహించేందుకు కూడా చంద్రబాబు సిద్ధమవుతుండటం చూస్తుంటే కూటమికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చంద్రబాబుకు కూడా అర్థమయినట్లే కనిపిస్తుంది.

**తలనొప్పిగా మారిన సవిత**

మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు. అదృష్టం బాగుండి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి అయి కూర్చున్నారు. దీంతో మంత్రి సవితకు ఏమీ అర్థం కావడం లేదు. కనీసం అధికారులను గౌరవించడం కూడా తెలయకుండా మంత్రులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫస్ట్ టైమ్ గా ఎన్నికై అదేదో తమ వల్లనే గెలిచామన్న భావనలో విర్రవీగుతుండటంతోనే ఈ సమస్య తలెత్తుతుంది. మంత్రులలో కొందరు అందులోనూ తొలిసారి మంత్రి అయిన వారు చంద్రబాబు నాయుడుతో పాటు పార్టీకి కూడా తలనొప్పులుగా మారుతున్నారు. గతంలో కడప జిల్లాకు చెందిన మంత్రి మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసు అధికారిపైనే జులుం ప్రదర్శించారు. దీంతో చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఆ దెబ్బకు మడింపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఆయన సతీమణి కూడా క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. ఎవరిని కట్టడి చేయలేని పరిస్థితి. తమకు అప్పగించిన శాఖల్లో పట్టు పెంచుకుని, ప్రజలకు సేవలందించాల్సిన అమాత్యులు అనవసర వివాదాల్లో కూరుకుని కూటమిని ఇబ్బందులు పాలు చేస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా వీరి పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. తాజాగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కూడా చంద్రబాబు సర్కార్ కు తలనొప్పులు తెచ్చేలా వ్యవహరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పెనుకొండ టిక్కెట్ తెచ్చుకోవడమే అదృష్టం. ఆపైన ఎమ్మెల్యే కావడం మరొక లక్కు. అదీ చాలక ఏకంగా మంత్రి పదవి వరించింది. అణిగి మణిగి ఉండాల్సిన మంత్రి సవిత మాత్రం రెచ్చిపోతున్నారు. అదీ అధికారులపైన మంత్రి సవిత దురుసు ప్రవర్తన సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ ఇచ్చిన బొకేను మంత్రి సవిత విసిరేసిన వీడియో వైరల్ గా మారింది. సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో ఘటన జరిగింది. ఈ నెల ఒకటో తేదీన రేషన్ బియ్యం పంపిణీ సందర్భంగా ఈ ఘటన జరగడంతో మంత్రి సవిత తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కోలుకుంటున్న పహల్గాం


**ఎంతో కష్టపడి ఒక అడుగు ముందుకు వేస్తే కలిసి రాని కాలం పదడుగులు వెనక్కి తోసినట్టుంది కశ్మీర్ అభివృద్ధి పరిస్థితి. ఉగ్రవాదుల పుణ్యమా అని అక్కడి సామాన్య ప్రజల అవస్థలు 'కక్కలేక, మింగలేక' అన్నట్టుగానే ఉన్నాయి. అత్యంత దుర్మార్గమైన పహల్గామ్ దాడి తర్వాత కశ్మీర్‌లో కొత్త సంక్షోభం తలెత్తుతోంది. అదే పర్యాటక వినాశనం.**




**దాడి జరిగినప్పటి నుంచి బుకింగ్‌లు జరగలేదని, మొత్తం 26 గదులు ఖాళీగా ఉన్నాయని నివేదించారు. అతను ముందస్తు చెల్లింపులను తిరిగి చెల్లించారు. ఆర్థిక పరిమితుల కారణంగా తన 15 మంది సిబ్బందిలో ముగ్గురిని మాత్రమే కొనసాగిస్తున్నారు.షోకెట్‌కు సుమారు రూ. 10 లక్షల మేర నష్టా లు సంభవించగా, ఇంకా కొనసాగుతున్న ఖర్చులు ఉన్నాయి. కానీ, ఆదాయం మాత్రం లేదు.**

ఏప్రిల్ 22, 2025న పహల్గాంలోని బైసరన్ లోయలో అమాయక పర్యాటకులపై దుర్మార్గపూరితమైన దాడి జరిగింది ఫలితంగా 26 మంది అత్యంత విషాదకరంగా ప్రాణాలు కోల్పోయారు. ఆ వెంటనే, ఆ ప్రాంతంలో గణనీయమైన అశాంతి నెలకొంది. ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారి ఇళ్లను అధికారులు కూల్చివేశారు. చాలామందిని అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌లోని 87 పర్యాటక ప్రదేశాలలో 48 ప్రదేశాల సందర్శనలను కూడా నిషేధించారు. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడిన ఈ ప్రాంతంలో స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది తీవ్రంగా ప్రభావితం చేసింది. దాడి తర్వాత కొన్ని వారాల నుంచి హోటళ్ళు, విమానాల రద్దు గణనీయంగా పెరిగాయి. చాలామంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టారు. వేరే మార్గం లేకపోవడంతో చాలా హోటళ్ళు తమ సిబ్బందిని తొలగించాల్సి వచ్చింది. వీరిలో చాలామంది కశ్మీర్‌లోని చిన్న పట్టణాల నుంచి వలస వచ్చినవారు. కాగా, తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను ప్రారంభిస్తూ, అభివృద్ధిని ఉగ్రవాదులు ఎంతగా దెబ్బతీయాలని చూసినా ఆపేది లేదని స్పష్టం చేశారు. కశ్మీర్ ప్రజలకు జీవనాధారమైన పర్యాటకాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్థాన్ కుట్రకు వ్యతిరేకంగా జమ్మూ కశ్మీర్ ప్రజలు నిలబడిన విధానాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈసారి కశ్మీర్ ప్రజలు చూపిన బలం పాకిస్తాన్‌కు మాత్రమే కాక యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి స్పష్టమైన సందేశాన్ని పంపినట్టయ్యిందని" ప్రధాని మోదీ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ యువత ఇప్పుడు ఉగ్రవాదానికి తగిన సమాధానం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఉత్తర భారతదేశంలోని జమ్మూ కశ్మీర్‌కు చెందిన అనంత్‌నాగ్ జిల్లాలోని పట్టణమే పహల్గాం. అనంతనాగ్ నగరానికి 45 కి.మీ. దూరంలో, లిడ్డర్ లోయ లో, లిడ్డర్ నది ఒడ్డున, హిమాలయాలలో సముద్రానికి సుమారు 7,200 అడుగుల ఎత్తులో ఉంది. పహల్గాం ప్రసిద్ధ పర్యాటక కేంద్రమేకాక హిల్ స్టేషన్ కూడా. ఇది హిందువులు అత్యంత పవిత్రంగా భావించి, ప్రతీ ఏడూ జరిపే సాహసోపేత యాత్ర అమర్‌నాథ్‌కు ప్రారంభ స్థానం. సంవత్సరం ప్రపంచం నలుమూలల నుంచి వేలాదిమంది పర్యాటకులు పహల్గాంకు వస్తుంటారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి జరిగిన నాటినుంచి ఇక్కడ పర్యాటకం పెద్ద ఎత్తున మూలకు పడింది. 'పహల్గామ్' అనే పేరు కశ్మీరీ పదాల నుంచి వచ్చింది. 'పుహేల్' అంటే 'గొర్రెల కాపరి', 'గోమ్' అంటే 'గ్రామం' అని అర్థం. ఇది కాలక్రమేణా పుహెల్గోమ్‌గా, పహల్గామ్‌గా మారింది. ఈ పట్టణ ప్రదేశం చుట్టుపక్కల అనేక పచ్చిక బయళ్లు ఆకర్షణీయంగా యాత్రికులకు కనువిందు చేస్తుంటాయి. ఇక్కడ బఖర్వాల్ ప్రజలు వేసవికాలం నుంచి చలికాలం ప్రారంభం వరకు వారి పశువులను మేపుకుంటూ తాత్కాలిక నివాసం ఏర్పరచుకుంటారు. హిందూ సంప్రదాయాల ప్రకారం పహల్గామ్‌ను మొదట బైల్‌గావ్ (ఎద్దుల గ్రామం) అని పిలిచేవారు. అమర్నాథ్ గుహలోకి ప్రవేశించే ముందు శివుడు, నందిని ఇక్కడే విడిచి పెట్టాడని ఒక పురాణ కథనం ప్రచారంలో ఉంది. స్థానికంగా పత్రికల వారికి అందిన సమాచారం ఇలా ఉంది. శ్రీనగర్‌లోని ఒక హోటల్ యజమాని షోకెట్ అహ్మద్ మాట్లాడుతూ, దాడి జరిగినప్పటి నుంచి బుకింగ్‌లు జరగలేదని, మొత్తం 26 గదులు ఖాళీగా ఉన్నాయని నివేదించారు. అతను ముందస్తు చెల్లింపులను తిరిగి చెల్లించారు. ఆర్థిక పరిమితుల కారణంగా తన 15 మంది సిబ్బందిలో ముగ్గురిని మాత్రమే కొనసాగిస్తున్నారు. షోకెట్‌కు సుమారు రూ. 10 లక్షల మేర నష్టా లు సంభవించగా, ఇంకా కొనసాగుతున్న ఖర్చులు ఉన్నాయి. కానీ, ఆదాయం మా త్రం లేదు. బారాముల జిల్లాలోని పల్హల్లన్ గ్రామానికి చెందిన వలస కార్మికుడు, శ్రీనగర్‌కు చెందిన జకురాలోని ఒక హోట ల్లో మాజీ హౌస్‌కీపర్ అయిన ఇర్ఫాన్ లోన్ దాడి తర్వాత కొద్దిసేపటికే తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. "నేను నిస్సహాయుణ్నయ్యాను" అని బాధతో అన్నాడు. శ్రీనగర్‌లోని ఖన్యార్‌లోని ఒక హోటల్లో వె యిటర్‌గా పనిచేస్తున్న ఇంతియాజ్ ఆహ్, ఆ ప్రాంతంలో పర్యాటకులు తగ్గుముఖం పట్టడంతో తన ఉద్యోగాన్ని ఎలా వదిలివేయమని అడిగారో చెప్పుకొచ్చాడు. తన కుటుంబంలో ఏకైక జీవనాధారమైన ఇంతియాజ్ ఈ సవాలుతో కూడిన సమయంలో వారికి ఆహారం అందించడానికి పడరాని కష్టాలు పడుతున్నాడు. పర్యాటక పరంగా సమస్యలను ఎదుర్కొంటున్నది ఒక్క హోటల్ కార్మికులు మాత్రమే కాదు. సోనామార్గ్‌కు చెందిన మహ్మద్ ఆరిఫ్ పర్యాటకుల కోసం గుర్రపు స్వారీలు నిర్వహిస్తాడు. "నేను సాధారణంగా పర్యాటకులను గుర్రంపై పచ్చిక బయళ్ల గుండా తీసుకెళుతుంటా ను. దీనిద్వారా రోజుకు 2,000 రూపాయలు సంపాదిస్తాను. కానీ, ఇప్పుడు నాకు చేసుకోవడానికి ఆ పని లేదు. ఇంట్లోనే ఖాళీగా కూర్చోవాల్సి వస్తున్నది" అని అతను వాపోయాడు. శ్రీనగర్‌లోని మొఘల్ గార్డెన్స్‌కు దారితీసే బౌలేవార్డ్ రోడ్డులో వీధి వ్యాపారి అయిన షానవాజ్, దాల్ సరస్సు దగ్గర కస్టమర్ల కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. "నేను ఇక్కడ గత 10 సంవత్సరాలుగా ఫలూడా ఐస్ క్రీం అమ్ముతున్నాను. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. గతంలో రోజుకు సుమారు 3,000 రూపాయలు సంపాదించేవాడిని, ఇప్పుడు 500 రూపాయ లు మాత్రమే సంపాదిస్తున్నాను. పాఠశాల ఫీజులు, నా పిల్లలకు ట్యూషన్స్ ఫీజులు సహా ఇంటి ఖర్చులను నిర్వహించడం కష్టంగా ఉంది. నా కుటుంబంలో ఆరుగు రు సభ్యులు ఉన్నారు. ఈ 500 రూపాయలతో ఎలా బతికేది?" అంటున్నాడతను. "కశ్మీర్ సురక్షితంగా, అందంగా ఉన్నందున పర్యాటకులు వచ్చి సందర్శించాలని నేను అభ్యర్థించాలనుకుంటున్నాను. కానీ నా అభ్యర్థన ఎంతవరకు వెళ్తుందో నాకే ఆశ్చర్యంగా ఉంది" అని ఆయన అన్నాడు. భారతదేశంలో, విదేశాలలో కూడా అతిథుల నుంచి యాత్రల రద్దులు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని షికారా, హౌస్‌బోట్ యజమానులు తాము ఎదుర్కొంటున్న అనిశ్చితిని వారు హైలైట్ చేశారు. "మేం పర్యాటక రంగంపై ఆధార పడతాం" అని అన్నారు. ఏదేమైనా, పహల్గాంలో జరిగిన దాడి కశ్మీర్లోని అనేక మంది వ్యక్తులు, కుటుంబాల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రత్యేకించి సుందరమైన పహల్గాం పట్టణంలో సాధారణ పరిస్థితులు ఎప్పుడు ఏర్పడతాయా అని స్థానికులు ఎదురు చూడటం తప్ప వారికి మరో గత్యంతరం కనిపించడం లేదు. త్వరలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర పహల్గాం నుండే ప్రారంభ మవుతుంది., ఉగ్రవాదుల భయాందోళనలకు అతీతంగా దేశంలోని ఆయా ప్రాంతాలకు చెందిన వేలసంఖ్యలో భక్తులు ఆ ప్రదేశాన్ని సందర్శించడానికి నమోదు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 'ఆపరేషన్ శివ' పేరుతో అమర్‌నాథ్ యాత్రికుల కోసం భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

## న్యాయవ్యవస్థపై నమ్మకం వుంది



మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నెలకే వెళ్లి కలవడం జరిగింది. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వండని అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి హసన్ ముష్రఫ్ కోరడం జరిగింది. ఇరిగేషన్ మంత్రిగా ఉన్నటువంటి హసన్ ముష్రఫ్ చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కు ఈ ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మించడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని కూడా కమిషన్ దృష్టికి తీసుకు వెళ్ళాము. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్లు జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చినాక నీటిపారుదల మంత్రిని కలిసి మళ్లీ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరడం జరిగింది. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్ర వచ్చి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కలిశారు. అనేక విధాలుగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కెసిఆర్ విజ్ఞప్తి చేశారు. ఏడేండ్లు మాకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి పార్టీ తరఫున ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేసింది తానేనని ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు పర్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని పడ్నవీస్ తేల్చి చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ఏడు సంవత్సరాలు అధికారంలో ఉంటే ఒక్క అనుమతి కూడా సాధించలేదు. ఒక్క అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. ఒక గుంట భూమిని కూడా సేకరించలేదు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి పట్టించు కోలేదు. సెంట్రల్ వాటర్ కమిషన్ తమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదు అని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసింది. అదేవిధంగా సిడబ్ల్యుసి, తమ్మిడిహట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థ్యం కూడా సరిపోదని సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని ఉత్తరం రాసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ ని బ్యారేజ్ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరడం జరిగింది. కేంద్ర సంస్థ వాప్కోస్ లాడార్ సర్వే చేసి, ఎగ్జామిన్ చేసి మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉంది అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చని తెలిపింది. వాప్కోస్, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజనీర్ల సూచన మేరకు మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడేండ్లుగా పొరుగు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేదు. అదేవిధంగా మహారాష్ట్రలో ముంపుకు గురవుతున్న చోట చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉంది. వైల్డ్ లైఫ్ అనుమతులు లభించాలంటే కనీసం 10 సంవత్సరాలు సుప్రీంకోర్టులో కొట్లాడాల్సి వస్తుంది. నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే నీళ్లు ఉన్నచోట ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించడం జరిగింది. అన్ని రకాల ఆధారాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసిన ఉత్తరాలు, జీవోలు అన్నీ కమిషన్ కు సమర్పించడం జరిగింది. కాళేశ్వరం కార్పొరేషన్ కి అనుమతి ఉందా అని అడిగారు. కాళేశ్వరం కమిషన్ కు స్పష్టంగా అనుమతి ఉన్న విషయాన్ని అన్ని ఆధారాలతో సమర్పించడం జరిగింది.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ మార్పుల గురించి అడిగారు. అది పూర్తిగా టెక్నికల్ నిర్ణయం ఇంజనీర్ల డీటెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లొకేషన్ మారింది. ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వాళ్ళు తీసుకునే నిర్ణయమని చెప్పాను. దేశంలో ఇలా అనేక ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో జరుగుతుంది వాటికి సంబంధించిన ఆధారాలు కూడా కమిషన్ కి సమర్పించడం జరిగింది. ఈ ప్రాజెక్టులో రిజర్వాయర్లకు కెపాసిటీ ఎంత అని అడిగారు. 141 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించామని చెప్పడం జరిగింది. కాళేశ్వరం పై పిచ్చి కూతలు కూస్తూ కూలేశ్వరం అని మాట్లాడుతున్నారు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉన్నాయి. అన్ని ఇంటెక్ట్ ఉన్నాయి. కాలేశ్వరం ప్రాజెక్టులో 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టిఎంసీల నీటి వినియోగం, పూర్తిగా ఇవన్నీ ఇంటాక్ట్ ఉన్నాయి.

ముఖ్యమంత్రి గంధమల్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు నీళ్లు మల్లన్న సాగర్ నుంచి పోతాయి. మల్లన్న సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం. హైదరాబాద్ మూసీ సుందరీకరణకు మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తరలిస్తామంటున్నారు. ఆ మల్లన్న సాగర్ కాళేశ్వరంలో అంతర్భాగం. అదేవిధంగా హైదరాబాద్ కు తాగునీటిని మల్లన్న సాగర్ నుంచి ఇస్తామంటున్నారు అది కాళేశ్వరంలో భాగం కాదా, మల్లన్న సాగర్ పై ఆధారపడ్డ గంధమల్లకు టెండర్లు పిలిచి శంకుస్థాపన చేస్తారు. మరో పక్క కాళేశ్వరం కూలింది అని దుష్ప్రచారం చేస్తారు. కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగింది. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించడం జరిగింది.

# అధికారుల తీరుపై మండి పడ్డ ఎమ్మెల్యే

- గత ప్రభుత్వంలో గ్రీన్ లాండ్, ప్రభుత్వ భూములకు ఇండ్ల నిర్మాణానికి అనుమతులు
- పేదవాడికి అన్యాయం జరిగితే సహించేది లేదు
- ప్రభుత్వం చెడ్డ పేరు తీసుకువస్తే చర్యలు తప్పవు



**జయభేరి, మహబూబాబాద్ :**

మహబూబాద్ జిల్లా పట్టణకేంద్రంలో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల రివ్యూలో ఎమ్మెల్యే మురళీనాయక్ అధికారుల తీరుపై మండిపడ్డారు...గత 10 ఏండ్ల బిఆర్ఎస్ పాలనలో మహబూబాబాద్ మునిపాలిటీ పరిధిలో గ్రీన్ లాండ్, ప్రభుత్వ స్థలాలకు ఇండ్లు నిర్మించడానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారు అని అధికారులపై మండిపడ్డారు.

అసలు ప్రజల అవసరాలకోసం వినియోగించుకోవాల్సిన గ్రీన్ ల్యాండ్లను ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇతరుల ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం సబబుకదని వాటి పై తక్షణమే వివరణ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పథంలో మహబూబాబాద్ నియోజక వర్గం పరుగులు పెడుతున్న దీనికి.కొంత మంది అధికారులు తీరు తల నొప్పిగా మారిందన్నారు.

కానీ నియోజక అభివృద్ధికి కొంత మంది అధికారుల పని తీరు తల నొప్పిగా మారిందన్నారు. ప్రజా పాలనలో రేవంత్ సర్కార్ లో నిరుపేదలకు ఇండ్లు, పేదల కడుపునిండా సన్న బియ్యం,ఉచిత విద్యుత్,ఉచిత బస్ వంటి పథకాలు,వీటితో పాటు పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్య శ్రీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల ముందు ఉంచమని ఈ సందర్భంగా తెలియజేశారు.

రానున్న వర్ష కాలం దృష్ట సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు దోమల మందును పిచికారి చేయాలని,అలాగే మున్సిపాలిటీ పరిధిలో విధి లైట్ల సమస్య ను తక్షణమే పరిష్కరించాలని , డ్రైనేజ్ వ్యవస్థను క్లియర్ గా ఉంచుకోవాలని గ్రామాలలో డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా రైల్వే ట్రాక్ తో ప్రజలు ఒక వైపు నుండి మరొక వైపుకు వెళ్లలన్న అనేక ఇబ్బందులు గురి అవుతున్నారు.

కావున వారి కోసం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ను తక్షణమే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందించాల్సిన సేవల విషయంలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు.



## వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అభినందనలు

**జయభేరి, దేవరకొండ :**

టీపీసీసీ కార్యదర్శి గా కలిసి పనిచేసిన మిత్రులు మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హృదయ పూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసిన నల్గొండ జిల్లా పార్లమెంట్ కో... ఆర్డినేటర్. ఎం ఏ సిరాజ్ ఖాన్, దేవరకొండ మాజీ మార్కెట్ చైర్మన్ ముక్కామల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## తుంకుంటలో వ్యక్తి అదృశ్యం

- ఆందోళనలో కుటుంబ సభ్యులు



**జయభేరి, శామీర్ పేట్, మే 9:**

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం తూంకుంటలో చోటు చేసుకుంది. కడప జిల్లా కొండాపురం మండలం కంచిమి రెడ్డి హరీష్ కుమార్ రెడ్డి (32) బ్రతుకు దెరువు నిమిత్తం భార్యతో కలిసి తుంకుంట కు వలస వచ్చి కర్కపట్ల లోని ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. అయితే ఈ నెల 8 న ఇంటి నుంచి బయటకు వెళ్లిన హరీష్ కుమార్ రెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో హరీష్ కుమార్ రెడ్డి సోదరుడు మల్లిఖార్జున్ రెడ్డి శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు పచ్చటి టీ షర్ట్, మరియు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలో మాట్లాడుతాడని వారు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 8712554144, 9490617142 నంబర్లకు సమాచారం అందించాలని వారు సూచించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఉపాధి హామీ కార్మికుల వేతనాల బడ్జెట్ విడుదల చేయాలి




- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్.

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో ఉపాధి హామీ కార్మికులకు 9వారాలు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మడక పాలెం పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 9 వారాల నుండి వేతనాలు చెల్లించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ 9 వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.ఉపాధి హామీ కార్మికులు అర్ధాకులతో జీవిస్తున్నారని 9 వారాల నుండి వేతనాలు బకాయి పెట్టడం అన్యాయం అన్నారు.

ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు మంచినీరు మజ్జిగ వంటివి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పారకి తట్టకి గుంపాంకి డబ్బులు చెల్లించాలని, వేసవి వేతనం కూడా కలిపి 40% అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకి 600 రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారంగా 309 రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులందరికీ మండలంలో అన్ని గ్రామాల్లోనూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకోవాలని కార్మికుల రక్షణకు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రతి వారం వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని గని శెట్టి ప్రభుత్వాలను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జయభేరి, కరీంనగర్:**

జిల్లాలోని వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం మరమ్మతులు మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పై సమీక్షించారు. వివిధ కార్యక్రమాలు,పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, వివిధ ప్రభుత్వ భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలకు పనులు మంజూరు చేశామని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన గ్రౌండింగ్ 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఏఈలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులు మొదలయ్యేలా చూడాలన్నారు. ఇది వరకే మొదలైన పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడి కేంద్రాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాల్లోకి తరలించాలని ఆదేశించారు. అక్కడ అవసరమైన మరమ్మతులు చేయిస్తామని, టాయిలెట్స్ నిర్మిస్తామని, నీటి వసతి కల్పిస్తామని అన్నారు. ఎంపీడీవోలు, సిడిపివోలు సమన్వయంతో తరలింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నందున మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అన్ని ప్రభుత్వ పాఠశాలలను, వసతి గృహాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షం కారణంగా నీరు నిలవకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డి.ఎం.డబ్ల్యూ.ఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.



### ప్రజావాణికి 304 దరఖాస్తులు:

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. 304 మంది అర్జీలు సమర్పించగా కొన్ని దరఖాస్తులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆన్లైన్లో పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులు ఆదేశించారు.

## సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది

- ఏసీపీ పి.మధుసూధన్‌రెడ్డి

**జయభేరి, చౌటుప్పల్ జూన్ 09:**

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని ఏసీపీ పి.మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బడుగు రామస్వామి, కమలమ్మ, పాలకూర్ల శివయ్యగౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జ్ఞాన దీప్తి పురస్కారాలను అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలో ఉన్న సౌకర్యాలను అనుకూలంగా మలుచుకుని విద్యార్థులు ఎదుగాలన్నారు. చిన్నతనం నుంచే చదువులపై ఏకాగ్రత సాధించాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ సమున్నత వ్యక్తిత్వం, సౌశీల్యంను పెంపొందించుకోవాలన్నారు. అంతేకాకుండా మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీరాములు, పాలకూర్ల మురళీ గౌడ్, దబ్బేటి శేఖర్, అక్షయ, పోలోజు రాజు, వెంకటాచారి పాల్గొన్నారు.



## లక్ష్మాపూర్ లో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

- ప్లాస్టిక్ వినియోగంతో ముప్పు తప్పదు : కమిషనర్ పవన్ కుమార్

**జయభేరి, శామీర్ పేట్, మే 9 :**

ప్లాస్టిక్ వినియోగంతో పెను ముప్పు ఉందని, సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమీషనర్ పవన్ కుమార్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్ లో ప్లాస్టిక్ నిషేదం పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తక, వాణిజ్య సముదాయాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లు, మెడికల్ దుకాణాల వారు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేదం పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమాన విదిస్తామని పలు దుకాణదారులకు ఆయన హెచ్చరించారు. అంతకు ముందు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, అధికారులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీ అరెస్టు చేయడం హేయమైన చర్య






**జయభేరి, దేవరకొండ :**

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ను ఈరోజు ఉదయం దేవరకొండ లోని తన నివాస గృహంలో అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు బిక్షపతి అన్నారు.బీసీలు నిరుద్యోగ సమస్యపై మరియు 42 శాతం రిజర్వేషన్ అడగడం తప్పు కాదు. వారు జనాభా శాతం లో 56% కలిగి ఉన్నందున 42 శాతం అడగడం తప్పేంకాదన్నారు .ఈ కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ ఆలిండియా సమత సైనిక్ దళ్ డివిజన్ అధ్యక్షులు జిల్లా రాములు డివిజన్ సభ్యులు కండల వెంకన్న మరియు కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదర్ ప్రసాద్ మద్దిమడుగు ఆనందు పేర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ శాసనసభ్యులు, వడ్త్యా రమేష్ నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని శివ సాయి ఫంక్షన్ హాల్ లో జరిగిన దేవరకొండ పట్టణానికి చెందిన కూరెళ్ళ కృష్ణాచారి శ్వేత దంపతుల కుమారులు రిత్విక్‌సాత్విక్ ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, వడ్త్యా రమేష్ నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టి చందంపేట మండల నాయకులు రాములు గౌడ్ రామ కృష్ణ శ్యామల చారి, సూరయ్య, హనుమంతు, సాయి, మకాం చంద్రమౌళి (సీఎం), బొడ్డుపల్లి కృష్ణ, వడ్త్య బాలు, పాత్లవత్ లక్ష్మణ్, జంగా చారి, తదితరులు ఉన్నారు.

## వివి ప్యాడ్ ల భద్రతా వివరాలను అడిగి తెలుసుకున్న సుదర్శన్ రెడ్డి

- ఈవీఎం, వివి ప్యాడ్ వేర్ హౌస్ గోడౌన్ ను తనిఖీ చేసిన చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి సుదర్శన్ రెడ్డి




**జయభేరి, శామీర్ పేట్, మే 9 :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈవిఎం, వివిప్యాడ్ వేర్ హౌస్ గోడౌన్ ను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తో కలిసి ఛీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తనిఖీ చేసారు. ఈ సందర్భంగా సిఈఓ, జిల్లా ఎన్నికల అధికారి, పార్టీల ప్రతినిధుల సమక్షంలో వేర్ హౌజ్ సీల్ తెరిచి గోడౌన్ లోని ఈవిఎం, వివిప్యాడ్ లు భద్రపరిచిన పెట్టెలను తనిఖీ చేసి వాటిని తెరిచి పరిశీలించారు. ఈవిఎం, వివిప్యాడ్ లకు సంబంధించి భద్రత వివరాలను జిల్లా ఎన్నికల అధికారి సిఈఓకు వివరించారు. తనిఖీ అనంతరం వారి సమక్షంలోనే గోడౌన్ తాళం వేసి సీల్ చేయడం జరిగింది. అంతకు ముందు జిల్లా ఎన్నికల అధికారి, సిఈఓకు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, శామీర్ పేట్ తాసిల్దార్ యాదగిరిరెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## శామీర్ పేట, అలియాబాద్ లలో రెవెన్యూ సదస్సులు

- భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు - తాసిల్దార్ యాదగిరి రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మే 9 :**

శామీర్ పేట, అలియాబాద్ లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట తహసీల్దార్ యాదగిరి రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ సంయుక్త, ఆర్ఐలు రాఘవ, కవిత, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్, ఆపరేటర్ విజయలక్ష్మీ, ప్రమోద్, రంజిత్, మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం అలియాబాదులో లబ్ధిదారుల నుంచి సుమారు 37 దరఖాస్తులను స్వీకరించారు. అలాగే శామీర్ పేట్ లో 51 దరఖాస్తులను స్వీకరించారు, గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, ఈ సదస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సంజీవ రెడ్డి, బండి రాంరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాము, మండల అధ్యక్షులు శ్రీకర్ రెడ్డి, నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

- ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్న మున్సిపాలిటీ : ఆర్ఓ వేణు గోపాల్



**జయభేరి, శామీర్ పేట్, మే 9:**

అలియాబాద్ మున్సిపాలిటీ లోని మజీద్ పూర్ గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు మంజూరు అయ్యాయి. గ్రామానికి చెందిన అంతాయిపల్లి బిక్షపతి, రమేష్, తుంకి వెంకటేష్, లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా మున్సిపాలిటీ ఆర్ ఓ వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ కిషన్, టౌన్ ప్లానింగ్ విజయ్ లు కలిసి ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.తొందరలోనే ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆర్ ఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్,ఏ ఎం సి డైరెక్టర్ బిక్షపతి, మాజీ సర్పంచ్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ అశోక్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అబ్బగౌని భాస్కర్ గౌడ్, నాయకులు సామల జశ్వంత్ రెడ్డి, గిర్మాపూర్ నర్సింగరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీ ఆస్తులను ఎవరూ తీసుకెళ్లలేరు.. నిశ్చింతంగా ఉండండి

- రిజిస్ట్రేషన్ల నిలిపివేత పై ఆర్డీవోతో మాట్లాడిన మధుయాష్కీ
- వెంటనే తగిన ఆర్డర్ ను విడుదల చేస్తామని పేర్కొన్న ఆర్డీవో



**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్ కమలానగర్, ఆంధ్ర కేసరి నగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్ లపై స్టేటస్ కో విధించిన సమస్యను పరిష్కరిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఆయా కాలనీల అసోసియేషన్ల ఆహ్వానం మేరకు మధుయాష్కీ కమలానగర్లో పర్యటించారు. ఆ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... 40 ఏళ్ల కిందట చేసిన లేఅవుట్లను తమ ఇనాం భూములు అని పేర్కొంటూ.. కొంతమంది కోర్టుకు వెళ్లి, ఇప్పుడు తమవంటే చెల్లదన్నారు. కాలనీవాసుల ముందే ఆర్డీవోతో మాట్లాడిన మధు యాష్కీ.. ఏ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ లపై స్టే విధిస్తారని ప్రశ్నించారు. తను కూడా న్యాయవాదినని, హైకోర్టు నుంచి నిర్దిష్టమైన ఆదేశాలు లేకుండా ఏ విధంగా రిజిస్ట్రేషన్ లపై స్టేటస్ కో ఇస్తారు అని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ లపై విధించిన స్టేను వెంటనే ఎత్తివేసేలా ఆర్డర్ ను రూపొందించి విడుదల చేయాలని సూచించారు. దీంతో స్పందించిన ఆర్డీవో త్వరలోనే తగిన ఆర్డర్ ను విడుదల చేస్తామన్నారు. కొంతమంది నాయకులు తెర వెనక ఉండి .. ఇలాంటి రిజిస్ట్రేషన్లు నిలిపివేత చర్యలు చేపడతారని.. బ్లాక్ మెయిల్, బెదిరింపులతో వసుళ్ల దందాకు తెర లేపారని అన్నారు. ఆ నాయకులు, వాళ్లే స్టేటస్ కో ఇప్పించి.. వారి చుట్టూ తిప్పించుకుంటారని పేర్కొన్నారు. అలాంటి వారి చర్యలు సాగవని, అధికారులు ఎవరైనా స్టేటస్ కో అంటూ చట్ట విరుద్ధంగా వ్యవహరించాలని చూస్తే.. వారి స్టేటస్ తొలగించేలా చేస్తామని హెచ్చరించారు. మీ ఆస్తులను ఎవరు స్వాధీనం చేసుకోలేరని... కాలనీవాసుల అంతా నిశ్చింతంగా నిద్రపోవచ్చు అని పేర్కొన్నారు. కోర్ట్ కేసు, రిజిస్ట్రేషన్ల పై స్టేటస్ కో కారణంగా ఆందోళనకు గురవడంతో పాటు అనారోగ్య కారణాలతో మరణించిన కాలనీ వాసి పీవీ రమణ రావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ఎవరూ భయపడవద్దని, ఆర్డీవో తో సమస్య పరిష్కారం పై మాట్లాడినట్లు పేర్కొని భరోసాను కల్పించారు. అక్కడ కలిసిన సీనియర్ సిటిజన్ అందరికీ ధైర్యం చెప్పారు. తాను అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడవచ్చునని మధుయాష్కీ గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, కమలానగర్ కాలనీ అధ్యక్షులు టీవీ రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ప్రతినిధి దివాకర్, న్యాయవాది వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, సత్యనారాయణ, పట్లోళ్ల మాధవరెడ్డి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 9 :**

ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో రంగా కన్వెన్షన్ హాల్లో మండలానికి చెందిన 276 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లను ,133 కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండలంలో ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్నారని ఇందిరమ్మ ఇండ్లను నాలుగు దఫాలుగా అందజేస్తామని అన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇండ్లను మంజూరు చేసిందని అందులో 500 ఇండ్లను తుర్కపల్లి మండలానికి అందజేసినట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు రాని వాళ్ళు అధైర పడవద్దని నాలుగు దఫాలుగా అందజేస్తామని అన్నారు. జూన్ 6న తుర్కపల్లి మండలంలో ముఖ్యమంత్రి సభను విజయవంతం



చేసిన నాయకులు, మహిళలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సభను విజయవంతం చేసినందుకు అందరికీ రుణపడి ఉంటారని అన్నారు . చిరకాల వాంఛ గంధ మల్ల ప్రాజెక్ట్ ,మండలంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రెండు వేల మంది విద్యా పేద విద్యార్థులు చదివే పాఠశాల ఇరవై ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల రెండు నుంచి మూడు నెలల్లో పూర్తి చేసుకోవాలని, నాలుగు విడతలుగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పైరవీలకు తావు లేదని ఎవరిని నమ్మి మోసపోవద్దని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని అన్నారు. వాసాల మరిలో ఇల్లు కోల్పోయిన వారికి ఇండ్లను అందజేస్తామని అన్నారు. మరో మూడు దపాలుగా ప్రభుత్వం అందించే ఇండ్లలో మండలానికి 1500 ఇండ్లను అందజేస్తామని అన్నారు. మండలంలో ఇల్లు లేని వారందరికీ అందజేస్తామని అన్నారు. ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేస్తామని వడ్డీ లేని రుణాలను అందజేస్తామని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ముందుకు పోతుందని, 8 మండలాల్లో తుర్కపల్లి మండలం క్రమశిక్షణకు పెట్టింది పేరని మిగతా మండలాలు చూసి నేర్చుకోవాలని అన్నారు. ఏ పథకమైన మహిళల పేరు మీద ఇస్తామని ఆదర్శవంతమైన మండలంగా తీర్చిదిద్దుతామని అన్నారు. చివరి లబ్ధిదారుని వరకు లబ్ధి పొందేలా కృషి చేస్తానని అన్నారు. పార్టీలకు అతీతంగా కలిసి అభివృద్ధి పథంలో నడవాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఒక ఇల్లు, ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. ఇది ప్రజా పాలన ప్రజల పాలన అందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ మోతిలాల్, తహసిల్దార్ దేశనాయక్ ,ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు సముచిత స్థానం ఇవ్వని మంత్రి వర్గ విస్తరణ

- మైనారిటీలకు సముచిత స్థానం ఇవ్వని మంత్రి వర్గ విస్తరణ MD రషీద్, డిండి టౌన్ BRS యూత్ ప్రెసిడెంట్



**జయభేరి, డిండి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన మంత్రి వర్గ విస్తరణలో మైనారిటీలకు సముచిత స్థానం దక్కలేదని డిండి టౌన్ BRS యూత్ అధ్యక్షులు MD రషీద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల కోసం ఏ ఒక్క పథకం కూడా ప్రవేశ పెట్టలేదన్నారు. మైనారిటీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లు పొందేందుకు దరఖాస్తు స్వీకరించి 10 నెలలు గడిచినా నేటివరకు లబ్దిదారుల ఎంపిక జరగలేదన్నారు. షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు సంవత్సరం దాటిన చెక్కులు అందటం లేదని, సీఎం ఓవర్సీస్ ఉపకార వేతనాలకు ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కోర్సు ముగిసినప్పటికీ ఉపకార వేతనాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ విడుదలకు మోక్షం కలగటంలేదని, మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాల, మైనారిటీ స్టడీ సర్కిళ్లు అందని ద్రాక్షగానే మిగిలాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తున్న మైనారిటి శాఖకు మంత్రిని కేటాయించలేదని, తద్వారా మైనారిటీ సమస్యలు ఆలకించే నాథుడే కరువయ్యాడన్నారు.

మైనారిటీ సంక్షేమ శాఖకు నేటివరకు ఐఏఎస్ హోదా కలిగిన అధికారి లేదని, కామారెడ్డి మైనారిటీ డిక్లరేషన్ కలగానే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మైనారిటీ సమస్యల పట్ల దృష్టిసారించి మైనారిటీలకు అండగా నిలువాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

- టిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో విలేకరులతో వేముల రాజు మాట్లాడుతూ చెల్లింపులు క్రమం తప్పడంతో పేద విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదని వాటి బిల్లులు జారీ చేసి ట్రెజరరీకి పంపిస్తున్న అవన్నీ అక్కడ ఆగిపోతున్నాయని బకాయిలు దాదాపుగా 4000 కోట్లకు పైన పెండింగ్లో ఉన్నాయని బకాయిలు పెండింగ్లో ఉండడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులు మరియు ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో బోధన రుసుములు ఉపకారవేత్తల కోసం ఏటా సరాసరిన 12.50 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు వీరికి ఏడ సుమారు రూ.2450 డిమాండ్ ఉంటుంది గడచిన విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫీజు బకాయి చెల్లించాలని నడుస్తుంది అది సక్రమంగా నడవకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంక్షేమ వర్గాల విద్యార్థులకు బోధన ఫీజులతో పాటు ఉపకార వేతనాలు (MTF)ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బుతో విద్యార్థులు ఇంటి నుంచి కళాశాలకు వచ్చి వెళ్లేందుకు రవాణా పుస్తకాలు ఇతర ఖర్చులు భరించాల్సి ఉంటుంది ఆ నిధులు కూడా వారి బ్యాంకు ఖాతాలలో జమ కాకపోవడంతో చదువుకునే సమయంలో చేతి ఖర్చు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతూ చదువులు కొనసాగిస్తున్నారు వాటికి సంబంధించిన బకాయిలను నెలల వారిగా విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మానవ వనరుల అభివృద్ధిలో కీలకమైన విద్యారంగా అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రి నియమించి విద్యాసంవత్సర ప్రారంభానికి ముందే పాఠశాలలో కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి గతంలో పునరావృత్తమైనటువంటి సమస్యలను పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## వికసిత్ కృషి సంకల్ప అభియాన్

- మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహన్



**జయభేరి, మహేశ్వరం :**

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ లోని మన్సాన్ పల్లి, రామచంద్ర గూడ గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించడానికి, స్థానిక రైతులతో సంభాషించడానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి పర్యటించారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు, మాజీ జిల్లా అధ్యక్షులు బొక్కా నరసింహారెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు యాదిష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య టెక్నో కార్పొరేట్ స్కూల్ నిబంధనలకు విరుద్ధం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ గిరిజన సంస్కృతి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కేతావత్ బాబురామ్ నాయక్ మాట్లాడుతూ.. స్థానిక దేవరకొండ పట్టణంలో ముదిగొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ఖమ్మం శ్రీ చైతన్య టెక్నో కార్పొరేట్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా వరుణ్ కృష్ణ బార్& రెస్టారెంట్ , సాయి రమ్య ఫంక్షన్ హాల్ ఈ రెండిటి మధ్యలో ఏర్పాటు చేశారు తెలంగాణ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇట్టి పాఠశాల యాజమాన్యం ప్రజలను శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ విషయమై స్థానిక M E O ఇంత జరుగుతున్న కనీసం పట్టించుకోవడం లేదు స్కూలు కనీసం 100 మీటర్ల దూరం కూడా లేదు యాజమాన్యంపై MEO ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్రలో నుంచి మేలుకొని తక్షణమే అట్టి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని గిరిజన ఎస్టి విద్యార్థులకు, ఎస్సీ బీసీ మైనార్టీ విద్యార్థులు మోసపోకుండా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని బాబురామ్ అన్నారు. లేనియెడల విద్యాశాఖకు కమిషనర్ కు దృష్టికి వెళ్తామని హెచ్చరించారు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం

- అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించండి
- అనుమతి లేకుండా నడిపిస్తున్న మదర్సాలను తొలగించండి
- ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి - శ్రీరాములు అందెల



**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు గారు మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించాలని, అలాగే అనుమతులు లేకుండా నడిపిస్తున్న మదర్సాలను తొలగించాలని మరియు ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అక్రమంగా నోట్ బుక్స్ మరియు యూనిఫామ్ లు తల్లిదండ్రులకు అమ్ముతున్నారని...వీటి అన్నిటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మా రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, జక్కిడి మధుసూదన్ రెడ్డి, ఎల్చల భాస్కర్ రెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# బాలయ్య ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పిస్తున్న అఖండ 2 టీజర్..

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం అఖండ2. తొలి పార్ట్ సూపర్ హిట్ సాధించడంతో రెండో పార్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. రేపు బాలయ్య బర్త్ డే సందర్భంగా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తుంది. బాలయ్య తనదైన శైలిలో డైలాగ్స్‌తో అదరగొట్టారు. 'నా శివుడి అనుమతి లేనిదే.. ఆ యముడు కన్నెత్తి చూడడు.. నువ్వు చూస్తావా..' అంటూ చెప్పిన డైలాగ్ చాలా బాగుంది. ఇక తమన్ ఎప్పటి మాదిరిగానే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో అదరగొట్టేశారు.. మొత్తంగా టీజర్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక ఈ టీజర్‌తో చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. డైరెక్టర్ బోయపాటి మార్క్ కనిపించేలా బాలయ్య 'అఖండ రుద్ర తాండవం' గూస్ బంప్స్ తెప్పిస్తోంది. 'శంభో' అంటూ హిమాలయాల బ్యాక్ గ్రౌండ్‌తో టీజర్ ప్రారంభం కాగా.. సింహం శివుడి రూపంలో ఉందా అన్నట్లుగా బాలయ్య ఎంట్రీ అదిరిపోయింది. గతంలో ఎప్పుడు కనిపించని విధంగా బాలయ్య కనిపించే సరికి ఫ్యాన్స్‌కి పిచ్చెక్కిపోతుంది. త్రిశూలం చేతబట్టి, ఒళ్లంతా విబూదితో జటాజూటధారియై.. ధర్మాన్ని కాపాడేందుకు సాక్షాత్తూ పరమశివుడే సింహం రూపంలో వస్తున్నాడా అన్నట్టుగా బాలయ్యని పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు బోయపాటి. అభిమానుల అంచనాలని ఏమాత్రం తగ్గకుండా పవర్ ఫుల్ యాక్షన్‌తో గూస్ బంప్స్ తెప్పించేలా బాలయ్యను చూపించారు బోయపాటి. వేదం చదివిన శరభం యుద్ధానికి ఎదిగింది అంటూ సాగే డైలాగ్ మూవీపై హైప్ పెంచింది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాత రామ్ ఆచంట, గోపిచంద్ ఆచంట నిర్మిస్తున్నారు.ఈ సినిమాను నందమూరి తేజస్విని సమర్పించడం విశేషంగా మారింది. ఇక ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే నట సింహం బాలయ్య బర్ డే సందర్భంగా విడుదలైన టీజర్ నెట్టింట హల్‌చల్ చేస్తుంది.

# 250కోట్ల కలలసౌధం



బాలీవుడ్ స్టార్ కపుల్ రణబీర్‌కపూర్, అలియాభట్‌కు చెందిన నూతన గృహ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. ముంబయిలో అత్యంత విలాసవంతంగా నిర్మించుకున్న ఈ భవంతి ఖరీదు 250కోట్లకుపైగా ఉంటుందని చెబుతున్నారు. రణబీర్‌కపూర్ అమ్మమ్మ కృష్ణరాజ్ కపూర్ పేరుమీద ఈ ఇంటిని నిర్మించారు. దాదాపు ఆరు అంతస్తులు కల ఈ భవంతిని రణబీర్, అలియా తమ వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దారని, దాదాపు రెండేళ్లుగా దీని నిర్మాణంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారని అంటున్నారు. బాలీవుడ్ లెజెండ్ రాజ్‌కపూర్ ఇక్కడే నివాసం ఉండేవారట. వారసత్వంగా ఈ ప్రాపర్టీ రణబీర్‌కపూర్‌కు దక్కిందట. దాంతో ఈ గృహాన్ని తమ కలలసౌధంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రణబీర్‌అలియా అంత భారీ మొత్తాన్ని వెచ్చించారని తెలిసింది. త్వరలో గృహప్రవేశానికి ఈ స్టార్‌కపుల్ సిద్ధమవుతున్నారు. ఇదిలావుండగా ఈ దంపతులు 'లవ్ అండ్ వార్' చిత్రంలో జంటగా నటిస్తున్నారు.



# మూడేళ్లు బెడ్‌పైనే..


మోడలింగ్ చేస్తూనే సినిమాల్లో అదృష్టం పరీక్షించుకుందీ అందాల తార. అరంగేట్రంలోనే శివ రాజ్ కుమార్ లాంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. ఆపై తెలుగులోనూ రామ్ పోతినేని, రవితేజ, సాయి ధరమ్ తేజ్, సుధీర్ బాబు, బెల్లం కొండ సాయి శ్రీనివాస్ తదితర యంగ్ అండ్ సీనియర్ హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా మెరిసింది. కొన్ని హిట్స్ కూడా పడ్డాయి. అయితే ఉన్నట్లుండి సినిమాలకు దూరమైందీ అందాల తార. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడేళ్లు కెమెరా ముందుకు రాలేదు. సోషల్ మీడియాలోనూ సందడి లేదు దీంతో ఈ ముద్దుగుమ్మకు ఏమైపోయిందోనని సినీ అభిమానులు కలవరపడ్డారు. అయితే ఒక రోజు సోషల్ మీడియా ద్వారా టచ్ లోకి వచ్చిన ఈ బ్యూటీ సంచలన విషయాన్ని బయట పెట్టింది. తనకు యాక్సిడెంట్ అయ్యిందని, అదృష్టం కొద్దీ ప్రాణాపాయం తప్పిందని చెప్పుకొచ్చింది. సుమారు మూడేళ్లు బెడ్ పైనే ఉన్నానంటూ తెలిపింది. దీంతో అందరూ షాక్ అయ్యారు. అయితే మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చిందీ అందాల తార. బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బిజీ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మరి ఈ క్యూటీ ఎవరో గుర్తు పట్టారా? తను మరెవరో కాదు ఇస్మార్ట్ పోరీ నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది నభా నటేష్. ఆ తర్వాత రామ్ పోతినేని ఇస్మార్ట్ శంకర్ తో సూపర్ హిట్ అందుకుంది. డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో సినిమాలతో తెలుగు సినిమా ఆడియెన్స్ కు మరింత చేరువైందీ అందాల తార. 2021 తర్వాత సుమారు మూడేళ్ల పాటు సినిమాల్లో కనిపించలేదు నభా నటేష్. దీనికి కారణం యాక్సిడెంట్. ఒక ప్రమాదంలో నభా తీవ్రంగా గాయపడింది. దాంతో ఆమె సుమారు మూడేళ్లు బెడ్ పైనే ఉండాల్సి వచ్చింది.



# వరుడు ఎవరో తెలుసా..?

బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా ఫేమస్ అయిన వారిలో శుభశ్రీ రాయగురు ఒకరు. సీజన్ 7లో సాధారణ అమ్మాయిగా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. ఆ తర్వాత గ్లామర్ షోతో మరింత పాపులర్ అయ్యింది. ఇక అమర్ దీప్ తో జరిగిన గొడవతో ఈ అమ్మడు పేరు నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. కానీ తక్కువ సమయంలోనే ఈ షో నుంచి బయటకు వచ్చిన శుభశ్రీ ఆ తర్వాత పలు సినిమాలు, ప్రైవేట్స్ సాంగ్స్ చేసింది. కానీ అంతగా గుర్తింపు మాత్రం సంపాదించుకోలేకపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్న శుభశ్రీ.. తాజాగా తన ఎంగేజ్‌మెంట్ ఫోటోస్ షేర్ చేసింది. తన ప్రియుడితో కలిసి నిశ్చితార్థం చేసుకున్నట్లు అభిమానులకు తెలియజేసింది. దీంతో ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు ఫ్యాన్స్. అదే సమయంలో శుభశ్రీకి కాబోయే భర్త గురించి తెగ ఆరా తీస్తున్నారు. ఏజే మైసూర్.. సినీరంగంలో నటుడిగా, నిర్మాతగా రాణిస్తున్నారు. కమ్మరాజ్యంలో కడపరెడ్లు, టెన్త్ క్లాస్ డైరీస్ వంటి చిత్రాల్లో నటించారు. అలాగే అటు నిర్మాణ రంగంలోనూ కొనసాగుతున్నారు. శుభ శ్రీ రాయగురు, ఏజే మైసూర్ కలిసి ఇటీవల మెసెస్టీ ఇన్ లవ్ అనే కవర్ సాంగ్ చేశారు. ఆ సమయంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటలెక్కనున్నారు. జూన్ 5న వీరిద్దరి నిశ్చితార్థ వేడక జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫోటోలను శుభశ్రీ రాయగురు తన ఇన్ స్టాలో పోస్ట్ చేయగా.. శుభాకాంక్షలు తెలుపుతున్నారు నెటిజన్స్. శుభశ్రీ విషయానికి వస్తే.. ఒడిశాకు చెందిన ఆమె.. తెలుగు, తమిళ భాషలలో పలు చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 7 కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది. సినిమాల కంటే ఎక్కువగా బిగ్ బాస్ షో ద్వారా పాపులర్ అయ్యింది. కళ్యాణ్ రామ్ నటించిన అమిగోస్ చిత్రంలో ఒక చిన్న పాత్ర పోషించింది. బిగ్ బాస్ షో ద్వారా గ్లామర్ బ్యూటీగా ఫేమస్ అయిన ఈ అమ్మడు.. ఆ తర్వాత సినిమా ఆఫర్స్ కోసం వెయిట్ చేసినప్పటికీ అంతగా కలిసిరాలేదు.

# టాలీవుడ్‌లో సూపర్ హీరోల సీజన్





సూపర్‌హీరో కాన్సెప్ట్‌లకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఎక్కువ. ఈ తరహా చిత్రాలు హాలీవుడ్‌లో ఎక్కువ తయారవుతుంటాయి. అయితే.. ఈ ట్రెండ్ కొన్నేళ్ల క్రితం మనదేశంలోనూ మొదలైంది. బాలీవుడ్‌లో రాకేష్ రోషన్ తెరకెక్కించిన 'కోయీ మిల్‌గయా'తో మొదలైన ఈ సూపర్‌హీరో ఫీవర్.. యష్‌రాజ్ ఫిల్మ్స్ 'ధూమ్'తో మరింత హీటెక్కింది. 'కోయీ మిల్‌గయా'కు కొనసాగింపుగా 'క్రిష్' ఫ్రాంచైజీ మూడు భాగాలుగా రాగా, ఇప్పుడు నాలుగో భాగం తెరకెక్కించేందుకు హృతిక్ రోషన్ సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకూ 'క్రిష్' ఫ్రాంచైజీని రాకేష్ రోషన్ రూపొందించారు. ఈ నాలుగో భాగాన్ని మాత్రం హృతిక్ రోషనే స్వయంగా డైరెక్ట్ చేయనున్నారు. ఇక 'ధూమ్' ఫ్రాంచైజీ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలూ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. త్వరలోనే 'వార్ 2' దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్‌కపూర్ హీరోగా నాలుగో పార్ట్‌ని యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించనుంది. ఇదంతా బాలీవుడ్ కహానీ. ఇక టాలీవుడ్ విషయానికొస్తే మనకు కూడా సూపర్‌హీరో కాన్సెప్టులు కొత్తేం కాదు. గతంలో సీనియర్ ఎన్టీయార్ ఇలాంటి పాత్రలు ఎన్నో చేశారు. చిరంజీవి చేసిన జగదేకవీరుడుఅతిలోకసుందరి, కొదమసింహం లాంటి చిత్రాలు ఓ విధంగా సూపర్‌హీరో కాన్సెప్టులే. ప్రస్తుతం తెలుగులో తెరకెక్కుతున్న సూపర్‌హీరో సినిమాల విషయానికొస్తే.. ముందు చెప్పుకోవాల్సిన సినిమా 'హరి హర వీరమల్లు'. ఇందులో రాబిన్‌హుడ్ తరహా పాత్రను పోషించారు పవన్‌కల్యాణ్. మొఘల్ సామ్రాజ్యాధినేత ఔరంగజేబుతో తలపడే పాత్ర ఆయనది. సూపర్‌హీరో చేసే సాహసాలన్నీ ఇందులో పవన్‌కల్యాణ్ పాత్ర చేస్తుందని సమాచారం. ముఖ్యంగా పిల్లలు ఇష్టపడేలా ఆయన పాత్ర సాగుతుందని అంటున్నారు.

ఈ ఏడాది రానున్న మరో సూపర్‌హీరో సినిమా 'విశ్వంభర'. ప్రపంచాన్ని కాపాడేందుకు, మానవ శక్తితో మరో గెలాక్సీలోకి అడుగుపెట్టిన ఓ సామాన్యుడి కథ ఇది. ఇందులో చిరంజీవి కారణజన్ముడిగా కనిపిస్తారు. ఈ సినిమాలో మెగాస్టార్‌పై చిత్రీకరించిన యాక్షన్ ఎపిసోడ్స్ రోమాంచితం చేస్తాయని సమాచారం. 70శాతం సీజీతో తెరకెక్కిన ఈ సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగానే ఉన్నాయి. దసరా కానుకగా ఈ సినిమా వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్‌తో అట్లీ చేయబోతున్న 'ఐకాన్' (ప్రచారంలో ఉన్న పేరు) సినిమా కూడా సూపర్‌హీరో కాన్సెప్టే అని టాక్. పైగా ఇందులో బన్నీ త్రిపాత్రాభినయం చేస్తున్నారట. ఈ సినిమాలో తాను పోషించనున్న పాత్రల కోసం న్యూయార్క్ ఫిల్మ్ స్టూడియోలో టెస్ట్ షూట్ కూడా పూర్తి చేశారని టాక్.

ఒకే స్క్రీన్‌పై ఒకే రూపంలో ఉన్న ముగ్గురు సూపర్ హీరోలు.. అట్లీ ప్లాన్ నిజంగా అదిరిపోయిందంటున్నారు సినీ అభిమానులు. ఇక 'హనుమాన్'ఫేం తేజా సజ్జా నటిస్తున్న 'మిరాయ్' సినిమా కూడా సూపర్‌హీరో కాన్సెప్టే. విధికి ఎదురెళ్లిపోరాడే ఓ యోధుడి కథగా ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్నారు. ఇంకా ప్రశాంత్‌వర్మ యూనివర్స్ నుంచి రాబోతున్న మహాకాళి, అధీర చిత్రాలు సైతం సూపర్‌హీరో కాన్సెప్టులతోనే రూపొందనున్నాయి. అమీర్‌ఖాన్‌తో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ తెరకెక్కించబోయే సినిమా కూడా సూపర్‌హీరో కథాంశమే అని వినికిడి. ఈ విధంగా స్టార్ హీరోలంతా సూపర్‌హీరోలుగా మారే పనిలో పడ్డారన్నమాట. మరి ఈ ట్రెండ్ ఇంకెన్నాళ్లు కొనసాగుతుందో చూడాలి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com